క్లుప్తంగా

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

పెద్దేముల్: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని, అవసరమైతే లైసెన్స్ రద్దుచేస్తామని మండల వ్యవసాయ అధికారి నజీరొద్దీన్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన బుధవారం మాట్లాడారు. త్వరలో యూరియ, డీఏపీ, పొటాష్ ఎరువులు మండలానికి రానున్నాయని తెలిపారు. రైతులు విత్తనాలు, ఎరువులు ఖరీదు చేస్తే తప్పనిసరిగా రసీదు తీసుకోవాలని సూచించారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



స్వామివారి సన్నిధిలో భక్తజనం

తాండూరు టౌన్: శివభక్త మార్కండేయ దేవాలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం స్వామి వారికి రుద్రాభిషేకం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం హోమం చేపట్టారు. పద్మశాలి సమాజ సభ్యులు, మార్కండేయ కాలనీ వాసులు పూజలు చేశారు.

పెళ్లీడు వస్తేనే వివాహం చేయాలి



గర్భిణులకు సీమంతం చేస్తున్న అంగన్‌వాడీలు, ఆశలు

పూడూరు: పెళ్లీడు వస్తేనే వివాహం చేయాలని, బాల్యవివాహాలను ప్రోత్సహిస్తే ఇబ్బందులు పడాల్సి వస్తుందని ఐసీడీఎస్ సీడీపీఓ వెంకటేశ్వరమ్మ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మంచనపల్లిలో గర్భిణులకు సీమంతం, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. కిశోర బాలికలకు వ్యక్తిగత పరిశుభ్రత, పోషకాహారం, ఐరన్ రిచ్ ఫుడ్ గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు అనసూయ, చంద్రకళ, ఏఎన్‌ఎం కృష్ణవేణి, అనంతమ్మ, ఆశలు చంద్రకళ, మంజుల, ఈశ్వరమ్మ, సావిత్రి పాల్గొన్నారు.

చాపలగూడెంలో విగ్రహ పునఃప్రతిష్ఠాపనోత్సవం

కుల్కచర్ల: ఈ నెల 9,10వ తేదీలలో చాపలగూడెంలో జరిగే వీరాంజనేయస్వామి విగ్రహ పునఃప్రతిష్ఠాపన ఉత్సవాలను విజయవంతం చేయాలని సర్పంచ్ లక్ష్మణ్ కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన మాట్లాడుతూ.. శుక్రవారం ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, గణపతి పూజ, నవగ్రహ పూజ, యాగశాల ప్రవేశం, అగ్నిప్రతిష్ఠ, తదితర హోమం కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 10న యంత్ర ప్రతిష్ఠ, మూర్తి ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి తీర్థప్రసాదాలు అందజేత కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. వేడుకలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు మొగులయ్య, సత్యయ్య, బాలయ్య పాల్గొన్నారు.

కాసానిని కలిసిన ప్రచార కార్యదర్శి



కాసానికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న శేఖర్

కొడంగల్: తెలుగుదేశం పార్టీ తెలంగాణ అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్‌ను ఆ పార్టీ కొడంగల్ నియోజకవర్గ ప్రచార కార్యదర్శి తలారీ శేఖర్ మర్యాదపూర్వకంగా బుధవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గ పరిస్థితులను ఆయనకు వివరించినట్లు శేఖర్ తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ అభిమానులు అధిక సంఖ్యలో ఉన్నారని, వచ్చే ఎన్నికల్లో కొడంగల్ నుంచి పార్టీ అభ్యర్థి పోటీ చేస్తారని చెప్పారు.

కూలీలు లేబర్‌కార్డులు పొందాలి



లేబర్‌కార్డులు అందజేస్తున్న ఎంపీటీసీ

దోమ: భవన నిర్మాణ రంగంలో దినసరి కూలీలుగా పనిచేస్తున్న ప్రతి ఒక్కరూ లేబర్‌కార్డును పొందాలని బొంపల్లి ఎంపీటీసీ రాములు అన్నారు. బుధవారం బొంపల్లి గ్రామంలో లేబర్‌కార్డు ఉన్న వారికి ఉచితంగా వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న కూలీలందరూ తప్పనిసరిగా లేబర్‌కార్డు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

కూర‘గాయాలు’

పెరుగుతున్న ధరలు మధ్యతరగతి ప్రజలకు గుదిబండగా మారాయి. ముఖ్యంగా కూరగాయలు, మాంసాహారాలతో పాటు నిత్యావసరాలు పిరమై గుండెల్లో పిరంగులు పేలుతున్నాయి!. కనీసం రూ.500లు లేనిదే చిన్నపాటి చేతి సంచి కాయగూరలు రాకపోవడంతో ఏం కొని తినాలో తెలియక దిక్కులు చూస్తున్నారు.

- సాగు తక్కువ.. డిమాండ్ ఎక్కువ
- భగ్గుమంటున్న వెజిటెబుల్స్ ధరలు
- చేతికి చిక్కనంటున్న చికెన్.. మటన్
- నింగినంటుతున్న నిత్యావసరాలతో సామాన్యుల విలవిల



క్రయవిక్రయ దారులతో కొడంగల్ సంత

కొడంగల్: వేసవి ఎండలతో పోటీపడుతూ కూరగాయలు, మాంసం, నిత్యావసర సరుకుల ధరలు మండిపోతున్నాయి. భగ్గుమంటున్న ధరలతో సామాన్యులు కొనలేని పరిస్థితి నెలకొంది. దీంతో ‘ఏం కొనేటట్టు లేదు. ఏం తినేటట్టు లేదని’ పేదలు వాపోతున్నారు. మార్కెట్లో బెండకాయ, టమాట, క్యారెట్, బీరకాయ, పచ్చిమిర్చి, చిక్కుడు, వంకాయ, దొండకాయ కిలో రూ.50పైనే ఉండగా.. మిరప కిలో రూ.80, అల్లం వెల్లుల్లి కిలో రూ.160 ధర పలుకుతోంది. కొత్తిమీర, కరివేపాకు, పుదీనా, పాలకూర, పాయిల్‌కూర, రాజిగిరి కూర, శ్యామ కూర రూ.20కి రెండు కట్టలు మాత్రమే ఇస్తున్నారు.

సాగుకు మించిన డిమాండ్

జిల్లాలోని పలు గ్రామాల్లో రైతులు వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ఇవి జిల్లా అవసరాలకు సరిపోవడం లేదని వ్యాపారులు అంటున్నారు. జిల్లా కేంద్రంతో పాటు మండలాల్లోని వారాంతపు సంతలకు వ్యాపారులు ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు తెచ్చి అమ్ముతున్నారు. వేసవి కాలం కావడం వలన సాగు తగ్గిపోగా.. పండుగలు, వివాహాల సీజన్ కావడంతో అవసరాలు పెరిగి.. డిమాండ్ పెరిగిపోయింది. దీంతో ఇతర ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకోవడం వలన రవాణా ఖర్చులతో కలిపి ధరలు పెంచాల్సి వచ్చిందని పలువురు దుకాణదారులు చెబుతున్నారు.

మాంసం ధరలు పైపైకి..

ఆకు కూరలు, కూరగాయలతో పాటు మాంసం ధరలు కూడా అధికంగానే ఉన్నాయి. ప్రస్తుతం మటన్ కిలో రూ.700, చికెన్ కిలో రూ.260 ఉండగా.. చేపలు రకాలను బట్టి రూ.200 నుంచి రూ.600 వరకు పలుకుతోంది. జనాలు ఎక్కువగా ఇష్టపడే కొరమీను డిమాండ్ ఎక్కువగా ఉంది.

పెను భారం..

పెరిగిన ధరలు సామాన్యులకు భారంగా మారాయి. కూరగాయల మార్కెట్లో ఏది కొనడానికి వెళ్లినా కిలో రూ.50పైగానే ఉంది. పచ్చి మిరపకాయ కిలో రూ.80 ఉంది. మాంసం దినసరి కూలీలు కొనలేని స్థితి. నిమ్మకాయలు రూ.20కి నాలుగు ఇస్తున్నారు.

– వాణిశ్రీ, గృహిణి, కొడంగల్

సాగునీటి రంగానికి పెద్దపీట

ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

దౌల్తాబాద్: తెలంగాణ ప్రభుత్వం సాగునీటి రంగానికి పెద్దపీట వేసి చెరువులు, కుంటలు అభివృద్ధి చేసిందని ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం దశాబ్ది వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో పెద్దచెరువు వద్ద సాగునీటి దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మిషన్‌భగీరథతో చెరువులను అభివృద్ధి చేయడంతో చెరువులు కళకళలాడుతున్నాయన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ కృష్ణన్, జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ విజయ్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ సుజాతరెడ్డి, సర్పంచ్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో స్నేహ సంబంధాలు మెరుగు



బహుమతులు ప్రదానం చేస్తున్న విజయ్‌కుమార్

షాబాద్: క్రీడాకారుల్లోని నైపుణ్యాన్ని వెలికితీసేందుకు క్రీడాపోటీలు ఎంతో ఉపయోగపడతాయని బీజేపీ నాయకుడు వర్రీ తులసిరామ్ విజయ్‌కుమార్ పేర్కొన్నారు. 10 రోజులుగా షాబాద్‌లో దివంగత నేత, పార్లమెంట్ మాజీ సభ్యుడు వర్రీ తులసిరామ్ స్మారకార్థం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులకు బుధవారం బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి కొమరబండ జట్టుకు రూ. 50 వేలు నగదు, మెమోంటో, రెండో బహుమతి షాబాద్ జట్టుకు రూ.25 వేల నగదు, మెమోంటో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో పాటు ఆటలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ఆటలతో గ్రామాల మధ్య స్నేహ సంబంధాలు మెరుగు పడతాయన్నారు. గెలుపోటములు సమానంగా స్వీకరించినప్పుడే ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌కుమార్, రాము, టీఎస్‌ఎస్‌ఓ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనివాస్, పార్టీ నాయకులు సురేష్, మహేశ్, రవిగౌడ్, శ్రీశైలం, గోవర్ధన్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడిలో చదువుకోవాలి



పూడూరు: బడిబాట ర్యాలీలో అధికారులు, చిన్నారులు

మండల విద్యాధికారి హరిశ్చందర్

పూడూరు: బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేసి, ప్రభుత్వ పాఠశాలల్లో చిన్నారులను చేర్పించే విధంగా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని మండల విద్యాధికారి హరిశ్చందర్ సూచించారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బుధవారం మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలు ఆంగ్ల మాధ్యమంలోకి మారుతున్న నేపథ్యంలో ప్రతి పాఠశాలలో విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్‌ను వేగిరం చేయాలని చెప్పారు. ఈ నెల 3 నుంచి 17 వరకు నిర్వహించనున్న ఎన్‌రోల్‌మెంట్ స్పెషల్ డ్రైవ్‌ను పగడ్బందీగా నిర్వహించాలన్నారు. అనంతరం ఉచితంగా పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: సర్కారు బడిలో చదువుకోవాలని ఉపాధ్యాయులు కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో ఇంటింటికీ తిరిగి బడీడు బాలబాలికలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలని వారి తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు బాకారం చంద్రశేఖర్, రాజశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



బొంరాస్‌పేట: మేడిచెట్టుతండాలో

దోమలో..

దోమ: బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలని బొంపల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షఫీ, ఎస్‌ఎంసీ చైర్మన్ శ్రీనివాస్‌లు అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని, నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, తమ పిల్లలను సర్కారు బడిలో చేర్పించాలని గ్రామస్తులకు సూచించారు. కార్యక్రమంలో బాబు, రాములు, రమేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఊరూరా చెరువుల పండుగ

- ఏర్పాట్లు సిద్ధం చేసిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- బోనాలతో జలాశయాల వద్దకు రావాలంటూ పిలుపు
- విద్యుత్ కాంతులతో జిగేల్‌మంటున్న చెరువు పరిసరాలు



కుల్కచర్ల: సమీక్షలో మాట్లాడుతున్న సర్పంచ్ సౌమ్యారెడ్డి

వికారాబాద్ అర్బన్: దశాబ్ది ఉత్సవాల సందర్భంగా గురువారం ఊరూరా చెరువుల పండుగ నిర్వహించనున్నారు. అందులో భాగంగా మున్సిపల్ పరిధిలోని శివారెడ్డి పేట్ చెరువు కట్ట విద్యుత్ కాంతులతో మెరిసిపోతోంది. చెరువు పై భాగం నుంచి హైదరాబాద్ వెళ్లే వాహనదారులకు విద్యుత్ దీపాల కాంతులతో చెరువు మరింత అందంగా కనిపించింది. ఏర్పాట్లను వికారాబాద్ ఆర్డీఓ విజయకుమారి, కమిషనర్ శరత్ చంద్రతో కలిసి పరిశీలించారు.

విజయవంతం చేయాలి..

బంట్వారం: ఊరూరా చెరువుల పండుగను విజయవంతం చేయాలని ఎంపీడీఓ బాలయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామ పంచాయతీలు, నీటి పారుదల శాఖ ఆధ్వర్యంలో సాయంత్రం ఐదు గంటలకు చెరువుల పండుగ ఉంటుందన్నారు. డప్పు చప్పుళ్లతో బోనాలు, బతుకమ్మలు, మత్స్యకారులు వలలతో ఊరేగింపుగా రావాలని ఆయన కోరారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ప్రతి గ్రామంలో చెరువుల పండుగ నిర్వహించాలని తహసీల్దార్ చిన్నప్పల నాయుడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. చెరువు కట్ట వద్దకు గ్రామస్తులు డప్పుచప్పుళ్ల నడుమ బోనాలతో రావాలని సూచించారు. అనంతరం అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సహపంక్తి భోజనం చేయాలని చెప్పారు.

ఆహ్వానం..

బొంరాస్‌పేట: చెరువుల పండుగను జయప్రదం చేయాలని మండల మాజీ వైస్‌ఎంపీపీ శేరినారాయణరెడ్డి అన్నారు. ఈ మేరకు చౌదర్‌పల్లిలో జీపీ కార్యాలయం వద్ద ఆహ్వాన పత్రికలను రైతులు, గ్రామస్తులకు అందజేసి ఆహ్వానించారు.

కుల్కచర్ల: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించే చెరువుల పండుగ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సర్పంచ్ సౌమ్యారెడ్డి కోరారు. బుధవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడారు. గ్రామంలోని చెరువు వద్దకు మహిళలు బోనాలతో రావాలని, అక్కడ అందరికీ భోజన వసతి కల్పిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి, జీపీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: చెరువుల పండుగను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో చెరువులు ఉన్న ప్రతి ఊరులో బోనాలు తీసి, ప్రత్యేక పూజలు చేయాలని చెప్పారు.

చెరువుల పండుగ హాస్యాస్పదం

డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి



కుల్కచర్ల: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా చెరువుల పండుగ అంటూ రాష్ట్ర ప్రభుత్వం హడావుడి చేయడం హాస్యాస్పదంగా ఉందని డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఒక్కసారి చెరువుల్లోని మట్టితీసి కట్టల మీద పొయ్యలేదని, చెరువుల పునరుద్ధరణకు ఎటువంటి కార్యక్రమాలు చేపట్టలేదని ఆరోపించారు. కానీ.. నేడు తమ రాజకీయ ప్రయోజనాల కోసం చెరువుల పండగని కొత్తగా చెరువుల పేరును వాడుకోవడం విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేశారు. నాడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే చెరువుల ఏర్పాటు, వాటి అభివృద్ధి జరిగిందని, బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఎటువంటి పనులు చేయలేదని విమర్శించారు.

ధరణి పోర్టల్‌ను ఎత్తివేయాలి

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి

కొందుర్గు: బీఆర్‌ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్‌ను ఎత్తివేయాలని యువజన కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు జితేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. భూ సమస్యలు పరిష్కరించాలని బుధవారం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా జితేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ధరణిని ఎత్తివేస్తామన్న కాంగ్రెస్‌ను బంగాళాఖాతంలో కలుపుతామన్న కేసీఆర్ మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో దరిద్రమైన ధరణి చట్టాన్ని తీసుకొచ్చి పేద ప్రజల జీవితాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆటలాడుకుంటుందని ఆరోపించారు. ధరణిలోని లోపాలను సరి చేయకుండా ధరణిపై మాట్లాడిన వారిని దరిద్రులంటూ ప్రతిపక్షాలపై ముఖ్యమంత్రి కేసీఆర్ దుమ్మెత్తి పోయడం సరికాదని విమర్శించారు. ధరణిలో ఏ మార్పులు చేయాలనే విషయమై జిల్లా కలెక్టర్‌కు అధికారాలు ఇవ్వడంతో భూ సమస్యలు ఎదురవుతున్నాయని, తహసీల్దార్ కార్యాలయానికి పూర్తి బాధ్యతలను అప్పగిస్తే సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. రాబోయే కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ధరణి పోర్టల్‌లోని లోపాలను సరి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో వజ్రమ్మ, నరేందర్, పహిల్వాన్, రవి, నర్సింహ్మ, హమీద్, రామస్వామి, మహిపాల్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, రమేష్, సురేందర్, రామయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పొజిషన్ కోసం పాదయాత్ర

కేశంపేట: తన భూమికి పొజిషన్ చూయించాలని మండలంలోని కాకునూర్‌కు చెందిన ఎర్ర వెంకటమ్మ బుధవారం ఆర్డీఓ కార్యాలయం వరకు పాదయాత్ర నిర్వహించారు. తన 20గుంటల భూమికి పొజిషన్ కోసం అనేక సార్లు రెవెన్యూ కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకున్నా న్యాయం జరగలేదని ఆరోపించారు. సావిత్రిబాయిపూలే మహిళా సంఘం, కుల అసమానతల నిర్మూలన పోరాట సమితి, అంబేడ్కర్ ప్రజా సంఘాలు, తెలంగాణ సామాజిక ప్రజా స్వామ్య విద్యార్థి సంఘం నాయకులతో కలసి ఆమె పాదయాత్రను చేపట్టారు. కార్యక్రమంలో సరోజన, లక్ష్మయ్య, మల్లేశం, క్రాంతికిరణ్, రాజు, చక్రవర్తి, గోవిందు, లక్ష్మయ్య, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

మున్సిపల్ చైర్మన్ నరేందర్

షాద్‌నగర్: ప్రతి ఒక్కరు ఆధ్యాత్మిక చింతన అలవర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ కొందూటి నరేందర్ అన్నారు. పట్టణంలోని గంజ్ ఆవరణలోని గణపతి దేవాలయంలో బుధవారం బీఆర్‌ఎస్ పార్టీ నేత మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ నరేందర్ హాజరై పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. భక్తిభావం పెంపొందించుకుంటే మనసు ప్రశాంతంగా ఉంటుందని, ఏకాగ్రత పెరుగుతుందని తెలిపారు. గ్రంథాలయ అభివృద్ధి కమిటీ డైరక్టర్ గోపాల్, నాయకులు ఎంసాని శ్రీనివాస్, ప్రకాష్, కృష్ణయ్య, శ్రీనివాస్, శ్రీకాంత్, ఆలయ ట్రస్టు సభ్యులు శంకర్‌లాల్ లాహోటీ, భగవాన్‌దాస్, గజానంద్, చగన్ మలానీ, కీర్తిశ్యాం, రాజేష్, సాయిమిత్ర అసోసియేషన్ సభ్యులు సురేందర్, జాన్‌వెస్లీ, శ్రీశైలం, కుమార్, బాలు, అర్చకుడు వికాస్ శుక్లా పాల్గొన్నారు.

పురాతన ఆలయాలను..

షాద్‌నగర్‌రూరల్: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత లభిస్తుందని సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యుడు, న్యాయవాది చెంది మహేందర్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా రాజాపూర్ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఆంజనేయ స్వామి దేవాలయానికి బుధవారం సెంట్రల్ ఫిలిం సెన్సార్ బోర్డు సభ్యులు చెందిమహేందర్‌రెడ్డి భారీ గంటను బహుకరించి మాట్లాడారు. హిందూ ధర్మాన్ని పరిరక్షించుకోవాలంటే పురాతన దేవాలయాలను కాపాడుకోవాలన్నారు.

ఆకాశం వైపు అన్నదాత చూపు



కొందుర్గులో దుక్కి దున్నుతున్న రైతన్న

- నేటి నుంచి మృగశిర కార్తె ప్రారంభం
- రెండు రోజులుగా అక్కడక్కడ కురుస్తున్న వర్షాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

కొందుర్గు: రోహిణి, మృగశిర కార్తెల్లో వర్షాలు సమృద్ధిగా కురిసి వానాకాలం సీజన్‌కు అనుకూలమైతే.. ఆశించిన స్థాయిలో దిగుబడులు వస్తాయని రైతన్నల నమ్మకం. ఇప్పటికే రోహిణి కార్తె పూర్తయ్యింది. గురువారం నుంచి మృగశిర కార్తె ప్రారంభమవుతుంది. మృగశిర కార్తెలోనైనా వర్షాలు కురిస్తే విత్తనాలు నాటేందుకు అదును దొరుకుతుందేమోనని అన్నదాతలు ఆశగా ఎదురుచూస్తున్నారు. రైతులు ఇప్పటికే దుక్కులు దున్ని, విత్తనాలు నాటేందుకు సిద్ధంగా ఉన్నారు. కాగా, గత రెండు రోజులుగా అక్కడక్కడ కురుస్తున్న వర్షాలకు రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో పత్తిపంట అధికంగా సాగుచేసే అవకాశం ఉంది. షాద్‌నగర్ డివిజన్‌లోని ఫరూఖ్‌నగర్, జిల్లేడ్ చౌదరిగూడ, కేశంపేట, కొందుర్గు, కొత్తూర్, నందిగామ, తలకొండపల్లి మండలాల్లో ప్రధానంగా వరి, జొన్న, మొక్కజొన్న, పత్తి పంటలను సాగు చేస్తారు. దాదాపు 1.40 లక్షల ఎకరాల విస్తీర్ణంలో పంటలను సాగుచేశారు.

ఈ ఏడాది పత్తిసాగు పెరిగే అవకాశం..

గత ఏడాది ఆశించిన స్థాయిలో పత్తిపంట దిగుబడి వచ్చింది. పత్తిపంటకు చీడపీడల ఉధృతి పెరిగి, పురుగుల మందుల ఖర్చుపెరిగినప్పటికీ పత్తి ధర అధికంగా పలకడంతో రైతులు లాభాలు గడించారు. దీంతో పత్తిసాగు పెరిగే అవకాశం ఉందని రైతన్నలు అభిప్రాయపడుతున్నారు.

రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత

జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి



కోల్డ్‌స్టోరేజీని ప్రారంభిస్తున్న అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యే

షాబాద్: రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జెడ్పీచైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, ఎంపీ రంజిత్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని సర్దార్‌నగర్‌లో రూ.2.50 కోట్లతో నిర్మించిన కోల్డ్‌స్టోరేజి, దుకాణ సముదాయాన్ని ఎమ్మెల్యే కాలె యాదయ్య, డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి, జెడ్పీటీసీ పట్నం అవినాశ్‌రెడ్డి, ఎంపీపీ కోట్ల ప్రశాంతిరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రైతు పండించిన ధాన్యం పాడవ్వకుండా ఉండేలా రూ.కోట్ల ఖర్చు చేసి కోల్డ్ స్టోరేజీలు నిర్మించడం సంతోషంగా ఉందన్నారు. వర్క్‌షాపు నిర్వహించి పంటలను కోల్డ్‌స్టోరేజీలో నిల్వ ఉంచేలా రైతులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. పంటల సాగులో తెలంగాణ నంబర్‌వన్‌గా నిలిచిందన్నారు. చెరువులు నింపుతూ, ఆయకట్టు పెంచడంతో రైతు లు పంటలు సమృద్ధిగా పండించుకునేలా ప్రభు త్వం చర్యలు చేపట్టిందన్నారు. ఎమ్మెల్యే కాలె యా దయ్య మాట్లాడుతూ.. రైతుల సంక్షేమానికి సీఎం పెద్దపీట వేస్తున్నారని తెలిపారు. 70 ఏండ్ల కాలంలో ఏ ప్రభుత్వాలు ఇలాంటి మంచి కార్యక్రమాలు అమలు చేయలేదన్నారు. డీసీసీబీ చైర్మన్ మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ...సహకార సంఘం అభివృద్ధికి ప్రభు త్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. షాబాద్ మండలానికి ఇప్పటివరకు రూ.40కోట్లు నిధులు ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో హైద రాబాద్ సీఈఓ శ్రీనివాస్, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింగ్‌రావు, సహకార సంఘం చైర్మన్ శేఖర్‌రెడ్డి, వైస్ మద్దూరు మల్లేష్, ఎంపీడీఓ అనురాధ, సర్పంచ్ స్వరూప, ఎంపీటీసీ వనిత, ఉపసర్పంచ్ ఇందిర, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, సీఈఓ శివకుమార్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు తదితరులున్నారు.